అవేశం
హద్దులు మీరితే
ఆ క్షణంలో
జరిగే అనర్థం?

# ఆ క్షణాలు

యం.వి.వి
సత్య
నారాయణ
కథ

ఇలా జరుగుతుందని ఆ ముసలాయనా అనుకోలేదు. ఇలాగే జరగాలని ఆ కుర్రాడూ అనుకోలేదు. ఏమాత్రం వీళ్లిద్దరి సంగతీ తారాస్థాయికి పోయినట్టు ఊహించి వుంటే ఆ అక్కా అలా ప్రవర్తించేదికాదు. లేకపోతే ఏమిటిది! అంతా కలసి కొన్ని క్షణాల్లోనే జరిగిపోయింది.

దీన్ని విధి అంటారా! దురదృష్టం అంటారా!

ఏదీ కాదు! మేలుకోవలసిన సమయం మించిపోతే ఏదైనా అంతే!

గడిచిపోయిన కాలం వెనక్కి రాదు. అలాగే జరిగిపోయిన చరిత్రా ఇక వెనక్కి తిరగదు.

అందుకే పై మూడుపాత్రల్లో ఒక పాత్ర అయిన సుశీల మెట్లమీద మూలుగుతోంది.

ఎందుకంటారా! నడుము విరిగిపోయి తల చిట్లిపోయి - అంతేకాదు, చెయ్యి జారిపోయిన క్షణాల్ని తల్చుకుంటూనూ.

మరి కథానాయకుడు ఆ ముసలాయన సంగతో

★ ★ ★

''నాన్నగారూ! నాన్నగారూ!''

ఇల్లంతా నిశ్శబ్దం! మనుషులు ఖాళీ చేసిన ఇల్లులాగా వుంది. కాని ఎక్కడి వస్తువులక్కడే వుండి మనుషులింకా అక్కడే వున్నట్టు దాఖలాలు కన్పిస్తున్నాయి.

క్రింద సూట్‌కేసు దించుకుని మళ్లీ పిలిచింది సుశీల. పిలిచి అంతటితో ఊరుకోలేదు. నాన్నగారు ఎప్పుడూ పడక్కుర్చీలో నడుం వాల్చి వుండే స్థలం వైపు చూసింది.

తోటవైపు కిటికీవద్ద పడక్కుర్చీ ఖాళీగా వుంది. సుశీల జోళ్ల చప్పుడు చేసుకుంటూ గదులు తిరుగుతోంది. నాన్నగారు పెరట్లో జామచెట్టు కింద పళ్లెంమీద కూర్చున్నారు. ఆయన చేతిలో భగవద్గీత వుంది. కళ్లు ఎర్రగా వున్నాయి.



ఆయన భగవద్గీత చదవడంలేదు. ఐహిక ప్రపంచాన్ని మర్చిపోయే కోపం చూపుల్తో పరబ్రహ్మంగారు తన జీవితాన్నో, జరిగిపోయిన సంఘటనల్నో పరిశీలించుకుంటున్నారు.

సుశీలకర్థమయ్యిందొక్కటే! మళ్లీ తండ్రీ కొడుకులకు హోరాహోరీ పోరాటమైపోయింది.

తండ్రి మహా మొండివాడని జగన్‌కి తెలియదా! తమ అందరి జీవితాలమీదా తండ్రికున్న పట్టు

తమకేకాదు. తమ బంధువర్గానికీ, చివరికి తమ వీధిలో అందరికీ తెలుసు.

చిన్నప్పుడు ఆ రోజు తనకింకా గుర్తే!

''ఎక్కడికిరా బయల్దేరావ్?'' అడిగారు నాన్నగారు.

జగన్ఎలిమెంటరీ పాఠశాలలో చేరిన ఆ రోజది. అప్పటికి అయిదో ఏడు దాటుతోంది వాడికి.

''ఆడుకుంటా నాన్నగారూ!'' అన్నాడు జగన్.

''వెధవా! పలక ఇలా తీసుకురా!'' కసిరారు నాన్నగారు.

బిక్కమొహం పెట్టాడు జగన్. వాడితోటి పిల్లలు, కాస్త పెద్దపిల్లలూ మామిడి తోటలో ఆడుకుంటున్నారు. వాడికి కూడా ఆడుకోవాలన్న కోరిక బలంగా వుంది. ఆడే పాడే వయసయ్యె!

సాయంకాలమయింది. దీపాలు పెట్టారుగానీ జగన్ని వదిలిపెట్టింది లేదు నాన్నగారు. వాడి వేళ్లకి బలపం ఆనవాళ్లు ఎర్రగా పడిపోయి ఇక ఆ రాత్రికి సొంతంగా అన్నం తినలేకపోయాడు.

ఇదొక్కటేనా!

జగన్ మీదే తన కలల ప్రపంచమంతా నిలబెట్టుకున్నాడు నాన్నగారు.

వాడ్ని తెల్లవారుజామునే నిద్రలేపేవారు. నిద్రకళ్లతోనే వాడికి చన్నీళ్ల స్నానం. రెండు వీధులు తిప్పి గుడికి తీసుకువెళ్లేవారు. చిన్నవయస్సు... వచ్చీరాని అడుగులు... మరో రెండు గంటలవరకూ తన సుఖనిద్రా ప్రపంచంలో విహరించవలసినవాడ్ని క్రమశిక్షణ పేరుతో, మతవిశ్వాసాల రుద్దుడుతో జగన్కి తన సొంత జీవితం లేకుండా చేశారు.

ఎదుగుతున్నాడన్నమాటేగాని జగన్ అంతా నాన్నగారి ఆశయాల రూపంలాగానే! అంతవరకే! నాన్నగారి ఉద్దేశ్యం ప్రకారంగానే ఇంజనీరింగ్లో సీటు సంపాదించుకున్నాడు జగన్.

''సివిల్ తీసుకో! మెకానికల్కి నీ తత్వం పడదు!'' అన్నారు నాన్నగారు.

జగన్కి ఎలక్ట్రానిక్స్ తీసుకోవాలనుంది.

అక్కతో మొరపెట్టుకున్నాడు జగన్.

''ఎలక్ట్రానిక్స్ అంటూ ప్రతి ఒక్కరూ అటు ఎగబడి పోతే ఈ బ్రాంచ్లో చదువుకునేవాళ్లెవరంటారు! రేపు సివిల్ ఇంజనీర్లకి గిరాకీ రాదని నీకు నమ్మకముందా!'' ఎగిరిపడ్డారు నాన్నగారు.

తర్వాత బహిరంగ స్వగతం!

''వాడు నాకు చేదైపోయినట్లు మాట్లాడతావేమమ్మా! వాడి జీవితాన్ని తీర్చిదిద్దాలనుకోవడం పొరపాటటమ్మా! సివిల్ ఇంజనీర్ మాత్రమే చేయగలడు జగన్''

''చదవాలనుకున్న వాడి ఆసక్తికూడా లెక్కలోకి తీసుకోవాలికదా నాన్నగారూ!''

కూతుర్ని రెప్పవాల్చకుండా చూశాడు తండ్రి.

తర్వాత జగన్ సివిల్ ఇంజనీరూ అయ్యాడు. సివిల్కి గిరాకీ లేక సొంతంగా కన్సల్టేషన్ ఆఫీసూ పెట్టుకున్నాడు.

''నాకేమైనా కాస్త పెట్టుబడి పెట్టకూడదూ నాన్నగారూ! కంట్రాక్టులైనా చేసుకుంటాను!'' అన్నాడు జగన్.

''పొలం అమ్మి ఇచ్చెయ్యమంటావ్!'' తిరిగి ఎగిరిపడ్డారు నాన్నగారు.

''పంట సొమ్ము బాంకులో వేస్తున్నారుకదూ!''

ఆయన కళ్లు ఎర్రబడ్డాయి. ముక్కుపుటాల చివర చెమట గుర్తులు బైటపడుతున్నాయి. చేతులూ కాళ్లూ చర్మంమీది నరాలు అలజడిగా కదిలాయి.

''నన్ను లెక్కలు అడిగేపాటి వాడివయ్యావన్నమాట!'' దీర్ఘంగా నిట్టూర్చాడు నాన్నగారు.

ఎగిసిపడ్తోన్న కోపాన్ని అణచుకుంటున్న చాఖలాకి ఆ నిట్టూర్పు చిహ్నం!

''అదికాదు నాన్నగారూ! నేను ఇలా అంటే మీరు అలా అనుకుంటారు. ఇటొస్తే అటు! అటొస్తే ఇటు!''

''హుం!''

''మీరాశించినట్టు జరగలేదు. సివిల్ ఇంజనీర్లకి ప్రస్తుతం గిరాకీ లేదు. అలా అని చెప్పి నేను ఖాళీగా కూర్చోలేనుకదా! కన్సల్టేషన్ ఆఫీసు తెరిచాను. దానికి హంగూ ఆర్భాటం కావాలి! లేదు. పోనీ... కాంట్రాక్టు పనులు తీసుకుందామనుకుంటున్నాను. కొంత పెట్టుబడి కావాలి.''

''పోగుచేసుకున్నది కాస్తా ప్రయోగం చేసి అవ్వగొట్టేస్తానంటావ్! అంతేనా!'' చెమట కణాలు ముక్కుచివర బిందువుగా మారాయి.

''నెగెటివ్‌గా ఎందుకనుకోవాలి?''

''మరి... అన్నీ లాభం వస్తాయని ఎలా ఊహించగలం? నిన్ను సివిల్ చెయ్యించానంటే నీకేదో లాభం కలుగుతుందనే కదూ! ఇప్పుడేమయ్యింది? నువ్వు చదువుకునేటప్పుడున్న సివిల్ మోజు ఇప్పుడు లేదు. అది నా తప్పుకాదు! మన దురదృష్టం! అందువల్ల ఇప్పుడు మనం పొలాలమీదికీ, బ్యాంకు బేలన్స్‌మీదికీ చూపులు కదిపామనుకో - ఇహ మన చేతికేం మిగిలి చస్తుందని!''

''అంటే ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?''


ఓపిక పట్టమంటాను. ఎద్దు ఎప్పుడూ ఒకేవైపు నిద్రపోదు చూడూ... అలాగే... సివిల్ ఇంజనీర్లనూ నెత్తిన పెట్టుకునే రోజులు వస్తాయి. విధి బలీయమైనది! దానిని ఎవరూ ఆపలేరు. ఏమో ... నీకు మరో రూపంలో మంచిరోజులు రావచ్చేమో! నా మటుకు నేను వేదం ఎనభై రెండు పన్నాలూ... ఒక్క ఎర్రటి ఏగాణీ ఖర్చులేకుండా...''

''అదేమిటి నాన్నగారూ! తమ్ముడి భవిష్యత్తు గురించి మాట్లాడమంటే ఛాదస్తం కబుర్లు చెబుతున్నారు'' ఉండబట్టలేకపోయింది సుశీల.

ఆయన ముక్కుపుటంనుండి చెమట బిందువు కిందికి కారింది.

అంతే! తర్వాత విరుచుకుపడిపోయారు నాన్నగారు.

సుశీల నిట్టూర్చింది. అదే చివరిసారి తను పుట్టింటికి రావడం! తాను అప్పుడన్న మాటల్లో తప్పేమిటో నాన్నగారెందుకలా విరుచుకుపడిపోయారో చాలాకాలంవరకు మతిపోగొట్టుకుందేకాని అర్థంచేసుకోలేకపోయింది.



నాన్నగారు సాయంకాలానికల్లా స్పృహలోకి వచ్చారు. కాని మూడేళ్లు గడిచినా తనకింకా విరుచుకుపడిపోనడంగురించి స్పృహకలగలేదు.

రెండురోజుల క్రితం నాన్నగారినుండి ఉత్తరం అందింది.

జగన్ ఎవరెవరివెంటో పడి తిరుగుతున్నాడట! వచ్చినవాడికి కాస్త గడ్డిపెట్టమని రాశారు నాన్నగారు.

ఇంటికొచ్చేటప్పటికి ఇదీ పరిస్థితి!

నాన్నగారు భగవద్గీత మీద చూపు నిలబెట్టలేక ఎక్కడికో ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్నారు.

''నాన్నగారూ!'' రెండు చేతుల్తో రెండు భుజాలూ పట్టుకుంది సుశీల.

పరబ్రహ్మంగారు తుళ్లిపడుతూ ఈ లోకంలోకి వచ్చారు.

''అమ్మా వచ్చావామ్మా!'' ఆయన గొంతు వణుకుతోంది. తుఫాన్ వర్షంలో తడిసిపోయిన చెట్టులాగా ముడుచుకుపోయాడాయన.

పరబ్రహ్మంగారి మెడను వాటేసుకుంది సుశీల.

గుండెలోతుల్లోంచి ఆవేదనా, ఆక్రోశం సుడులు తిరుగుతున్నాయి. ఒంటికణం కణంలోనూ దుఃఖం పొటమరిస్తోంది.

జీవితం కోణం కోణంలోనూ ఎన్నో అనుభవాలు! ఎన్నెన్నో అనుభూతులు! సుఖదుఃఖ సమ్మిళితమైన జీవిత ప్రయాణంలో దుఃఖానికో ప్రత్యేకత వుంది.

విభేదాలు మరచిపోయి మనుషులు ఏకమవుతారు.

ఇక పుట్టింటికి రాకూడదనుకుంది సుశీల. ఎంతకాలం చూసినా నాన్నగారు శాసించినట్టే తమ జీవితాలు వెళ్లదియ్యాలంటే అది రానురాను సొంత ఆలోచనని చంపేస్తోంది.

జీవితేచ్ఛతోపాటు -

కేవలం జాతకాలు సరిపోయాయని చెప్పి తనకో మొగుడ్ని కట్టబెట్టారు నాన్నగారు. అగ్రవర్ణాలవారి చాదస్తంతోబాటు 'పనిగండం' ఒకటి వుంది ఆ మొగుడనే మొద్దుస్వరూపానికి!

తిండికి లోపంలేదు. పూటకి అరకిలో పప్పు లాగించగలడు.

పనిచేస్తే ప్రమాదమట!

ప్రయివేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం సంపాదించుకుని మొగుడ్ని పోషించుకుంటోంది సుశీల.

తండ్రినుండి సహాయం లేదు.

తమ్ముడైనా అందివచ్చి తమ కుటుంబానికెప్పుడైనా చేయూతనిస్తాడనుకుంటే ఆ ఆశకూడ లేదు.

ఇదంతా కేవలం ఆయన మూర్ఖత్వం! పలాయన మంత్రం! చేయవలసిందంతా చేసి ఫలితం దగ్గర రాజీ పడిపోతారు.

ఫలితం అనుభవించే వ్యక్తికి తెలుస్తుంది. ఆ బాధ ఎంత నరకమో!

సుశీలలో ప్రస్తుతం తండ్రిమీద కోపం లేదు. ఆయన తన అజ్ఞానానికి తానుకూడా బలైపోయాడుకదా! ఇప్పుడాయనా తానూ ఒకే పరుగుమీదున్నట్టు! పడవ తలకిందులైనట్టూ -

నీటి మధ్యలో ఆసరాకోసం వెతుక్కుంటున్నారు. కళ్లు జలపాతాలయ్యాయి.

అవే క్షణాల్లో - ఈ కథలో మూడోపాత్ర ఏం చేస్తున్నట్టు!

జగన్ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో వున్నాడు. అవతలపక్క వినబడే గొంతుకోసం ఎదురుచూస్తున్నాడు. అసహనం అతడ్ని ఉంగలు చుడుతోంది. ఆవేశం అతడిలో నరనరం వణికిస్తోంది. ఆక్రోశం అతడి మస్తిష్కం పొరల్ని కుదిపేస్తోంది.

రిసీవర్‌లోకి విసుగ్గా చూశాడు.

"ఎస్... మాధురీ స్పీకింగ్!" అంది అవతలి గొంతు.

"మాధురీ... నేనే..." అన్నాడు జగన్.

"చెప్పు జగన్...!"

"ఏమన్నారు మీ నాన్నగారు?"

"జగన్! ఆయన అదే మాటమీదున్నారు!"

"ఇల్లరికం వద్దు మాధురీ! నువ్వైనా నచ్చచెప్పవలసింది!"

"మీ ఇంట్లో నీ పరిస్థితి ఎంతో మా ఇంట్లో నా పరిస్థితీ అంతే జగన్! నీకు తెలియనిదేముంది!"

"పోనీ మనం వేరే ఇంట్లో కాపురం పెడదాం!"

"డబ్బు"

జగన్ గుటక వేశాడు. అన్ని విషయాలూ సరితూగుతున్నాయి. ఒక్క డబ్బు దగ్గర తప్ప! ఛీఛీ... డబ్బు...

"మాధురీ! డబ్బు మనల్ని సంపాదించిందా! మనం డబ్బుని సంపాదించామా?"

"జగన్!" మాధురి నెమ్మదిగా నవ్వింది. "ఎవరు ఎవర్ని సంపాదించినా ప్రస్తుతానికి మా నాన్నగారు సంపాదించిన డబ్బే మన ఇద్దరికీ ఆధారం! దాంతోనే నీ కన్సల్టేషన్ ఆఫీసు నడుస్తుంది. అది నడిస్తే మన సంసార చక్రం కదుల్తుంది. ఆ మాత్రానికే మనం ఇంట్లోంచి బైటికి వెళ్లిపోయి వేరే కాపురం పెట్టడం దేనికి!"

జగన్ రోషంతో రిసీవర్‌లోకి చూశాడు. అత్తింట్లో కాపురం చెయ్యదట మాధురి!

"మీ నాన్నగారి స్వార్థం నాకు నచ్చదు!" అంటుంది మాధురి.

ఇప్పుడెలా! అన్నింటికీ అడ్డం పరబ్రహ్మం అనే పెద్దమనిషి.

క్షణాలు గడుస్తున్నాయి.

"జగన్..." అవతలి గొంతులో అనుమానం!

"గుడ్ బై..." యువతరం ప్రతినిధిలాగా... రోషావేశాల ప్రతీకలాగా రిసీవర్‌ను విసురుగా క్రెడిల్ చేశాడు జగన్.

★ ★ ★

పరబ్రహ్మంగారు కాఫీ గ్లాసు తాకలేదు.

సుశీల ఆయన్ని బలవంతపెట్టింది. కాని ప్రయోజనం లేకపోయింది. మూడు రోజులనుండి పచ్చి మంచినీళ్లు ముట్టుకోలేదాయన. మనిషి జావగారిపోయి వున్నాడు. కళ్లలో ప్రాణాలు నిలబెట్టుకుని వున్నాడు.

## తాగుబోతులు

ప్రముఖ వైద్యుడు ఆల్కాహాల్‌ను గురించి ఉపన్యసిస్తున్నాడు. ఒక విద్యార్థి సభలోనుంచి లేచి, "ఆల్కాహాల్ తీసుకున్నవారు తమ పనులను చక్కగా చేసుకుంటారట నిజమేనా?" అని అడిగాడు.

"అందులో ఎంతమాత్రం నిజం లేదు. అది తీసుకున్నవారికి ఒకవిధమైన తెగింపు వస్తుంది. సిగ్గు వదులుకుంటారు. ప్రతిపనీ పాడుచేస్తారు!" చెప్పాడు ఓస్లర్.

- కొడిమెల



అయినా సరే కాఫీకూడా ఎంగిలి పడదల్చుకోలేదు.

''తమ్ముడికిచ్చి వస్తాను!'' అంది సుశీల.

''వాడు ఇంట్లో ఎందుకుంటాడు? అదెవత్తో వుందికదా. దానితో షికార్లు...'' నీరసంతో ఆవేశంతో వణుకుతున్నాడాయన.

''వచ్చినట్లున్నాడు నాన్నగారూ! ఇందాక మెట్లమీద చప్పుడయింది''

''వస్తేమటుకేమయిందమ్మా! తన గదిలో వుండిపోతాడు తలుపు బిడాయించుకుని!''

''చూస్తాస్తా నాన్నగారూ!''

ఆయన మొహంలో అంగీకార సూచన కనిపించలేదు. అయినప్పటికీ సుశీల ధైర్యంచేసి మెట్లవైపు మళ్లింది. ఒక్కొక్క మెట్టే ఎక్కుతోంది. మెట్లపైన ఒక్కటే గది!

అమ్మకి వైద్యం చేయించవలసి ఆ గది కట్టించారు నాన్నగారు. ఆ గదిలో గాలి బాగా తగుల్తుంది. అమ్మ పోయాక జగన్ తన చదువుకి ఉపయోగించుకుంటున్నాడు.

టక్... టక్...

ఏదో చప్పుడు!

నాన్నగారు పడిపోలేదుకదా!

వెనకనుంచి కేక!

''అమ్మాయి లాభంలేదమ్మా, వాడు తలుపు తీయడు!''

సుశీల వెనక్కి చూస్తోంది.

గుమ్మంవద్ద నిలబడున్నాడు తండ్రి. నీరసంతో నీరసంలో వచ్చే కోపంతో వణికిం వణుకుతున్నాడాయన.

''ఇందాక చప్పుడు వినిపించింది నాన్నగారూ! మీరా చేశారు చప్పుడు!''

ఆయన పట్టించుకోలేదు.

''వాడితో మాట్లాడలాను. కులంకాని కులం పిల్లతో వాడికి పెళ్లేమిటి! ఇల్లరికమేమిటి? వాడికి డబ్బు సాయం కావాలంటే అప్పు తీసుకోవచ్చుకదా!''

సుశీలకు అర్థంకాలేదు.

''ప్చ్...''

''ఏమిటి నాన్నగారూ!''

''పరవాలేదమ్మా! బాంకులో మన డబ్బే వుండగా ఇక అప్పెందుకు? అంతవరకూ ఒక పదివేలు ఇస్తానని చెప్పు''

సుశీల నుదురు ముడతలు పడింది.

''పదివేలు! ఎంత ప్రాణప్రదంగా వుంది డబ్బు''

సుశీల మెట్లెక్కింది. తలుపు తట్టింది.

తలుపు సులువుగా తెరుచుకుంది.

గదిలో స్టూల్ తిరగబడిపోయి వుంది. దానికి అడుగు ఎత్తున పాదాలు గాలిలో వూగుతున్నాయి. శరీరం గజగజ వణుకుతోంది!

''తమ్ముడు...''

వేల గబ్బిలాలు ఎగిరినట్లు!

వేలాది చీకటి గొంతులు కుంయోమన్నట్టు -

మెట్లమీద పాకుతోంది ముసలి ఆకారం. ఆకారం దగ్గరకి దొర్లుతూ వస్తోంది సుశీల. కెవ్వున కేకపెట్టే ఓపిక లేక! మూలుగుతో!

''అమ్మా... అమ్మా...!''

పరబ్రహ్మంగారి పిలుపు అందనంత దూరానికి ఆయన బిడ్డలు ప్రయాణమవుతున్నారు.

ఒక బిడ్డ కొన్ని క్షణాల క్రితం వెళ్లిపోతే ఇంకో బిడ్డ చావుకు అటుపక్క కొట్టుకుంటోంది. సాక్ష్యంగా మెట్లమీద కొబ్బరికాయ పగిలాక చిటిలాగా ధారల రక్తం!